కథానిక

# తారతమ్యం

వి. యస్. కళ్యాణి

టేబిల్ మీద టిఫెన్ ప్లేటు తెల్లబోయింది.

కాఫీ ఫ్లాస్కు కోపగించి మూతి మూరెడు చేసింది.

అరటిపళ్ళు నల్లనల్లగా హుంకరించాయి.

గోడగడియారం రౌడీరంగన్న వేషంవేసుకొచ్చి అరంకెమీద అట్టహాసం చేసింది. టేబిల్ క్లాక్ అన్నగారి హాసానికి లయ కలిపింది. "వెధవగడియారా లిన్నెందుకూ ఏడవనూ! మనుషులంటే ఓ గౌరవమా! సానుభూతా?"

"అక్కయ్యా! కోపం గడియారాల మీద చూపిస్తే అవేం చేస్తాయే పాపం!" తమ్ముడి కెంత వేళాకోళం!

గడియారా లేంచేస్తాయి?

మునీశ్వరుడి గుండెలాగా ప్రశాంతంగా కొట్టుకుంటూ సాగింది గడియారం. ఆరూ అయిదు నిమిషాలు!

"ఫోటోస్టాండులో మనిషిని చెడామడా నాలుగు లంకించుకోవే అక్కయా..."

"ఛారా. నువ్వ మరీను వేళాపాళాలేదు వేళాకోళానికి" ఫోటోలో బావ నవ్వుతున్నాడు.

"ఎలా నవ్వుతున్నాడో చూడవే. నవ్వుతూనే గొంతు కోస్తారే కొందరు!" తమ్ముడు అక్కను అండగా చేసుకుని తనివితీరా ఆనందిస్తున్నాడు.

ఆ నవ్వుముఖంలో మోసం ఎక్కడేనావుంది!

"ఆయనెప్పుడూ ఇంతాలస్యం చేయ్యలేదు. అందులోనూ ఇవాళ" అక్కమనసు బిక్కచచ్చిపోతూంది.

"అవును, ఇవాళా! మా అక్కయ్య సినీమాకి పోవాలని అన్నీ అరేంజిమెంట్లూ చేసుకుని కూర్చుంటేను! ఘోరమైన నేరం. వొచ్చాక—"

"రోజూ తను తొందరచేసి నాలుగు లిడుతూంటేగాని నా పని కాదని ఆయనభిప్రాయం. ఇవాళ యింతా సిద్ధంచేసి"—

"అదేనక్కయ్యా పొరపాటు. ఏదీ ఆ టిఫెనూ, కాఫీ మనిద్దరం కాజేసి చూద్దాం బావెందుకూడి పడడోనూ!"

"అవునంటే చెయ్యాలి! లేకపోతే ఏమిటీమనిషి నాలుగున్నర తర్వాత ఆఫీసులో కూర్చోటం అబ్బురమైన మనిషి!"

అమ్మో... ఆరున్నర.

ఇంకేం సినీమా! నా బొంద సినీమా.

మరోమారు సకిలించింది వాల్ క్లాక్.

"రానీ చెప్తాను! ఎన్నడూలేని రాచకార్యాలివాళే ముంచుకొచ్చాయి కాబోలు. ఇంతకూ సినీమాకి ప్రయాణమవడం డబ్బు ఖర్చు కున్నారు కాబోలు. రా...నీ...చెప్తాను."

"చెప్పడం కాదక్కయ్యా. చేసి చూపించాలి"

అబ్బాయి 'హమాయానా'లాగ నవ్వేడు.

"అమ్మా సినీమా యేదే. నాన్నింకా రాలేదేం!" బాబు తల్లి పంచను చేరేడు.

"ఇవాళ సినీమాలు ఆడరట నాయినా హాయిగా నువ్వెళ్ళి ఆడుకో"—బాబు మామయ్యవంక సందేహంగా చూశాడు.

"నాన్న రాలేదుగా రేపుపోదాంలే" అంది తల్లి.

బాబు రివ్వున వెళ్ళేడు వీధిలోకి.

"అయినా ఇంతాలస్యం ఎప్పుడూ చెయ్యలేదురా. ఆరున్నరదాటి పది నిమిషాలైపోయింది" అక్క ముఖంలో సంకోచం ప్రారంభించింది.

"సినీమాకు పోదామని బావతో చెప్పావా?" తను చేసుకున్న తీర్మానానికి నిర్ధారణగా తమ్ముడడిగేడు.

"అవును అన్నాను. కొత్తసినీమా వచ్చిందట. రోజూలాగే వస్తారు కదా యివాళ కూడానూ అని. మనిషికర్థంకాదూ!"

"ఇంకేం నే ననుకున్న దశరాలా రైటయిపోయింది! అక్కయ్యా సినిమా టైము దాట

వెయ్యాలని బావగారి అభిప్రాయం తెలుసా? మరి చూసుకో తడాఖా. ఏడుంపావుకి ఠెంగుఠెంగువచ్చి"

"ఊ... అవును వస్తారు! ఆడదంటేనూ, దాని కోరికంటేనూ అంత అలుసు. మగాళ్లు స్వార్థపరులు!"

తమ్ముడు పకపకా నవ్వేడు "అలావచ్చేసి అక్కయ్యా, తప్పంతా నీదేనని తప్పేసుకుంటాడు ఊఁ మరి"—

"నామీదా? అవును ఆడదేం చెయ్యగలదని అలుసు. అంటారు అనకేం చేస్తారు! నా తప్పే ఐతే! నే నడగలేనా?"

"ఓష్... అక్కయ్యడుగుతుందని నే నెరగనూ శేషుగ్గా చెప్పేస్తాడు సమాధానం. బావంటే బావామరి! స్పష్టంగా నువ్వు చెప్పలేదు నేనేం కలగన్నానా నువ్వు సినీమాకి ప్రయాణం కడు తున్నావని—అంటాడు."

"పోరా. ఆయనకి తెలియదంటే నేనొప్పు కోను. ఇంకేదో కారణం ఉండాలి."

"చెప్తున్నా కదే అక్కయ్యా. తప్పునే కారణ మని" తమ్ముడు నవ్వుతూంటే అక్కకెంత బాధగా వుందనీ!

"ఎవరైనా స్నేహితులు కలిశారేమో, ఆఫీసు పని ఎక్కువగా వుందో."

"అక్కయ్యా బావొచ్చి విధానం చెప్పనా— చప్పున చెప్పెహ్ మరి" అక్కయ్య కుతూహలంగా చూసింది. "ఆ టిఫెన్, కాఫీ మనం" తమ్ముడిమాట గుటుక్కుమంది.

"పోరా సన్యాసీ. ఎప్పుడూ అదేవరసా?"

అక్కయ్య లోపలి కొచ్చేసింది. తమ్ముడు వీధి వైపు చూసేడు.

ఏడు దాటింది. అతను రాలేదు. ఏంపనోమరి! ఏడున్నర కావచ్చింది. అతని జాడలేదు. ఏ పనీ చెప్పలేదే!...

ఏడున్నర దాటింది. అదేం చెప్మా! ఎన్నడైనా ఇంతాలస్యం? తానసలు సినీమా ప్రోగ్రాం ఎందుకు పెట్టుకుంది?

'వెధవసినిమా, పోలేపోయింది. ఆయనరాలేదేం చెప్మా... పావుతక్కువ ఎనిమిది! అమ్మో!"

అక్క గుండె గుభిల్లుమంది, చూస్తూన్న పుస్తకం జారిపోయింది. ఏదో అడుగుల చప్పుడు! ఆయనే కావచ్చు.

పక్కకు తప్పుకున్నాయి పదధ్వనులు.

వీధిలోకి వచ్చింది అక్క.

"ఆయనేం నల్లపూసా! ఛీ వీధికూడా వెక్కి రిస్తుందే."

"ఎక్కడికైనా వెళ్తానని చెప్పేడేవిటే బావ" అనడిగేడు తమ్ముడు. సమాధానం చెప్పాలనిపించ లేదు. గుండెల్లో దిగులుగావుంది. తమ్ముడి గొంతులో వేళాకోళం అట్టే వినిపించలేదు.

"ఏం చెప్పలేదు" అనేసి ఊరుకొంది.

ఇంట్లోకీ గుమ్మంలోకీ లెక్కపెట్టకుండా తిరి గింది అక్క.

ఎనిమిది గంటలు కొట్టింది గోడగడియారం. పిల్లవాడు అన్నంతిని నిద్రపోయాడు 'నాన్న రాలే దమ్మా' అంటూనూ.

"పోనీ ఎవర్నైనా కనుక్కుంటే..." ఉండబట్ట లేక అనేసింది తమ్ముడితో. ఎవర్ని కనుక్కోవాలీ, ఏవనీ...?

తనకు తెలియదు. ఆయనాఫీసువాళ్ళెవరో, ఎప్పుడూ కనుక్కోలేదు. బావుంది. ఎలా కను క్కుంటారు అవసరం పడనప్పుడూ. మాటవరసకు ఆయనేనా చెప్పలేదు.

"పోనీ మా బావాసుఫీలో పనిచేసేవారెవరో అని కనుక్కురానా?" అక్కకు కోపంవచ్చింది.

"అబ్బ, ఎక్కడి ఘటానివిరా నువ్వూ... మరీనూ..."

"పోనీలేవే అక్కా! నేను ఉపాయం చెప్తే అబ్బాదిబ్బా అంటావా! నీకు స్వయంగా తోచదూ! ఇంతేనే ఆడాళ్ళు!"

అక్కయ్యాలోచిస్తూంది.

ఏమనడగాలీ? ఆఫీసుకొచ్చారా అనా? ఆఫీ సులో కూర్చున్నారా అనా? తిరిగివస్తూంటే చూశారా అనా? వెధవది! ఏవిటిది మరీను. ఇంట్లో ఆడదేమనుకుని చావాలని? అంతా నిర్లక్ష్యం.

ఆ తిరగబోయే రాచకార్యాలేవో కాస్త చెప్పి తిరక్కూడదూ తెల్లవార్లూనూ ... ఏవనుకుంటే ఏంలాభం?

ఎనిమిదింపావు! అక్కకు దుఃఖంవచ్చేట్టుంది. ఎందుకు రాలేదు? సవ్యంగా తెల్లారుతుందా? తను సినీమాకి పోవాలనుకోకపోతే ఈ బాధ తప్పే దేమో! ఛా, అదంతా చాదస్తం.

తమ్ముడికో అద్భుతమైన ఆలోచన తట్టింది. "అక్కా, తెలిసిపోయిందే!" కుర్చీలోంచి సగం లేచాడు. అక్క కళ్లు నాలుగు చేసుకుని చూసింది. నాలుగు చెవులతో వింటూన్నది.

"బావ సినిమాకి ఉడాయించాడే!"

అక్కకి హృదయం దిగజారింది.

"ఏం...అంత చెప్పకుండానూ...ఒక్కరూ పోవాలనా?"

"మొదలనుకోక పోవచ్చును. దారిలో సినిమా పోస్టర్లు చూస్తూంటే తక్షణం వెళ్ళిపోవాలనిపించ వచ్చును."

తమ్ముడి ధోరణి అక్కకు కోపాన్ని ఊసి గొల్పింది.

"పొద్దున్నే చెప్తే కాదూకూడదూ అంటాననా-అయినా ఓమూల నేనూ అనుకుంటున్నానని తెలిసుండీ కూడా!"

"అదే పొరపాటే అక్కా...అలా గెప్పుడూ అనుకోకు. మగాళ్లు చేసే పనులన్నీ ఆడాళ్ళకి చెప్పి చేస్తారు టేమరి? తప్పుతప్పు! సినీమా బాగుందో లేదో చూసి తానేముందు చెప్పాలని అనుకుని ఉంటాడు బావ మంచివాడు కాబట్టి-"

"మంచితనం ఉద్ధరించినట్టే వుంది! కబుర్లపిట్టవి! ఆఫీసునుంచి అలా నేరుగా వెళ్ళే అలవాటు లేదురా, ఆయనలా చెయ్యలేదెప్పుడూ."

"ఇప్పుడు చేశాడులేవే. మగాడికి తనమీద యింట్లో యిల్లాలికి ఎప్పుడూ ఒకటే అభిప్రాయం ఉండడం కిట్టదు: తన 'కారెక్టర్'లో 'వెరైటీ' చూపెట్టి——"

"ఒరేయ్ నువ్వూరుకో ఆయన సినీమాకెళ్ళరు!"

అక్కయ్య గడియారం చూసింది. అరగంట కొట్టి, ఎనిమిదిన్నర చూపెట్టి 'పాపం!' అంది గడియారం.

మళ్ళీ ఒకసారి గుండె 'గుభేలు' మంది.

"పోనీ...ఎక్కడైనా అమాంతం కనిపించేసి రాత్రి తెలియకుండా కాలక్షేపం చేయించే స్నేహితులుండి వుంటారు బావకు!"

తన ఉద్దేశ్యం రైట్ అన్నట్టు చూశాడు తమ్ముడు.

"ఊహూ...ఎవరున్నారు!...ఇదివరకు లేనివారెక్కడినుంచి వస్తారు హఠాత్తుగా?"

హు...అని సుదీర్ఘమైన నిట్టూర్పు విడిచి కాళ్ళు బారచాచి కూర్చున్నాడు తమ్ముడు. మాట్లాడాలనే యిష్టం లేకుండా పోతూంది అక్కకు. మంచంమీద పడుకుంది.

"ఏదీ కావంటావ్...ఇంతకూ మరి బావెందుకు రాలేదంటావ్!"

ఎందుకు రాలేదంటుంది? ఏం జరిగి వుంటుంది? సినీమాకి వెళ్ళేడనుకుందుకు యిదివరకలా చెయ్యలేదు. ఆఫీసులో అనుకోనేందుకు యింతపనుంటుందా? స్నేహితులా అంతంత మాత్రమే కద...

కథల్లో చదువుతాం నిజంగా జరుగుతాయంటారు. ఉదయం కులాసాగా బయటికెళ్ళిన మనిషి మరింటికిరాడు. దారిలో...ఏదో...ఏది?...అబ్బో ఉచ్చరించటం కూడా కష్టంకాదూ...

బస్సులూ, కారులూ, బళ్లూ...సైకిళ్లూ... అనేకం దారిలో పోతూవుంటాయ్. బస్సు దిగుతూంటే...కారెక్కుతూంటే...ఏదో టక్కరై... ఏ నిముషం ఏలావుందో? అంతా రెప్పపాటు... ఏంచెప్తుంది...ఏం చెప్తుంది తను?

వెధవ మనసు వారెందుకు రాకపోవాలింత వరకూ...ఎప్పుడూ చేయలేదింతాలస్యం.

"ఏమో నాకు తెలియదురా."

మనస్సు పరిపరివిధాల పోతూంది. నిస్పృహ గుండెని ఆవరిస్తోంది. కాస్సేపు మనస్సాలోచించక పోయినా బాగుండును.

అక్కయ్య బాబుదగ్గిర పడుకుంది. బాబు తలమీద మృదువుగా నిమిరింది. ఎందుకో కళ్ళంట నీళ్లు తిరుగుతున్నాయి. అది తనకిష్టంలేదు. ఐనా తప్పటంలేదు.

గడియారం నిరామయంగా సాగుతోంది. దానిది ఋషీశ్వరుడిలాంటి ఉనికి. ఏ నిముషంలో ఏం జరిగినా లెక్కలేకుండా ముందుకే సాగిపోతుంది. కాలగమనంలోని రహస్యమే అది.

తమ్ముడు భోంచేయలేదు. ఆకలిగా వుందేమో.

"అన్నం తింటావేంటిరా తమ్ముడూ' అంది.

"అరగంటలో బావొస్తాడు కదే...ఏకంగానే చేద్దాంలే" అన్నాడు తమ్ముడు.

అవునేమో సినీమాకే వెళ్ళేరేమో- లేకపోతే తమ్ముడికింత గట్టి అభిప్రాయం ఎందుకుంటుందీ!

సినిమాకే పోయివుండాలి. బస్సులో వస్తూంటే దారిలో నేకదూ హాలు-అయినా కాస్త ఆలోచన వుండొద్దూ.

ఇదివరకలా చెయ్యలేదే!

ఏమో యిప్పుడెందుకు చెయ్యకూడదూ అనుకుంటారు...మగాళ్లు!

ఇంతకీ వెళ్ళేరో లేదో- అబ్బే వెళ్ళేవుంటారు. లేకపోతే యీపాటికొచ్చేసేవారే... కాని మన స్నూరుకోదేం?

ఎంత వద్దనుకున్నా మరేదో సంకోచం-సందేహం.

రోజూ ఎనిమిదింటికో కునుకుతీసేవి కాదూ ఈ కళ్ళు. కాస్త కనుమూద్దామంటే మూతలు పడనంటాయ్.

తొమ్మిదిన్నర దాటి అయిదు నిమిషాలైంది. మొదటాట తొమ్మిదింపావుకే విడిచేస్తారు కదూ.

"ఇంకా రాలేదేంరా తమ్ముడూ?"

"ఆటవలేదేమోనే" అంటాడు తమ్ముడు.

"అసలు సినిమాకెళ్ళేరంటావా?"

"పోనీ చూసిరమ్మంటావా సినిమా హాల్సు... తప్పదియ్యా ఓ పన్నెండు హాళ్ళేనా వుంటాయనుకుంటాను. వీటిని చుట్టబెట్టి వచ్చేలోగా నన్నే వెతుక్కోవలసి వస్తుందేమో బావ. నీ యిష్టంమరి" అక్కకసహ్యం వేసింది. ఓమూల గుండె వేడెక్కిపోతూంది. బయట నిలబడింది వీధివంక చూస్తూ. "అక్కా యింతవరకూ వచ్చాక యిల్లు మరచిపోడులేవే బావ." అక్క మాట్లాడలేదు. తమ్ముడూరుకున్నాడు. కాస్సేపయాక అనిపించింది-అంత ధైర్యం తనకే వుంటే!...అని. 'టైమెంత అయిందిరా' అంది.

"తొమ్మిదీ నలభై" అంటూ అక్క సరసకొచ్చాడు తమ్ముడు.

"తొమ్మిదిన్నరకు రెండోఆట మొదలెడతారు-ఈపాటికొచ్చి వుండాల్సిందే- ఏమోలే...మన సినిమాలు అనుకున్నట్టుగా అవవే. ఒస్తూనే వుండొచ్చీపాటికి"

అక్కకు నమ్మకంగాడున్నాయితమ్ముడిమాటలు.

"అదుగో అడుగులచప్పుడు" తమ్ముడు కళ్ళంత చేసుకుని చూశేడు. "ఎక్కడరా" అక్కకు నిస్పృహగానే వుంది.

"అమ్మయ్య- ఇంక పదవమ్మా తల్లీ...కాదంటావేం? ఎంత దర్జానో చూడు సినిమా హీరోకి" తమ్ముడింట్లోకి వచ్చేశాడు. అక్క తేరిపార చూసింది.

అవును ఆయనే!ఒక్కసారి గజగజలాడించిందిచలి. అంతవరకూలేని చలి! ఎంతో బరువుతీసి పెట్టినట్టు-అక్క అక్కడే నిలబడింది. బావొచ్చాడు.

"ఇక్కడ నిలబడ్డావేం...చలిలేదూ" అంటూ నవ్వుతూ వచ్చాడు లోపలికి. చలిట చలి!... అక్కకి కోపంవచ్చింది.

"అక్కా చలి చంపేస్తూంది కదూ. కాస్త వేడివేడి కాఫీ"...తమ్ముడు ఫ్లాస్కు తీస్తున్నాడు.

"ఏవండీ. కాస్త ఈ చెవిలో ఊది వెడితే వద్దంటానా! నేనూ వస్తానని భయంవేసిందా? ఇంతంతసేపు ఐపులేకపోతే యింట్లో ఆడ దేవనుకుని చావాలనీ.? కాస్త అంతమాత్రం ఆలోచనుండక్కర లేదా? భోజనమా! దిబ్బా."

ఆభిమానం పొంగివచ్చింది అక్కకు. గుండె స్వేచ్ఛగా కొట్టుకుంటూంది. "ఆదేం భోంచేయలేదూ? అరె, ఇలాకూర్చుంటార నెవరనుకున్నారు? తింటారనుకున్నాను."

అయ్యో ఆయ్యో ఎంత ధీమా! "అవును భోజనం కూడా నయిస్తుంది!" కోపంగా అంది అక్క.

"మరేం లేదులే బావా. నీకు సాయంకోసం."

"అదేమిటోయ్, భోంచేయకుండా కూర్చున్నారా? నాన్సెన్స్! ఆలా ఎవరు చెయ్యమన్నారయ్యా!" బావ ఆశ్చర్యపోతున్నాడు.

"ఒకరు చెయ్యమంటే ఎవ్వరూ చెయ్యరు! అబ్బ! ఒక బాధా.అక్కడికీ ఏం తోచక పక్కింటి పంకజమ్మ మొగుణ్ణి కూడా అడిగించాను."

"ఏవనీ?" సినిమా హీరో కిదంతా 'ఘోరంగా' కనిపిస్తోంది. "ఏమనా...ఏదో అని. ఆఫీసు కసలు వెళ్ళేరో లేదోనని."

"ఊం మారిపోతా ననుకున్నావ్. లేకపోతే లేచిపోతా ననుకున్నావు" అక్కయ్యకి చెప్పరాని ఆభిమానం.

"అవును. సినిమాకి వెళదాం అన్నానుకదా చెప్పకుండా అతీగతీ లేక పైగా మాటలు కూడానూ! అంతేలెండి."

బావాప్పుకో లేదు. "చెప్పేవా, మనసులో అనుకున్నావు కాబోలు. స్పష్టంగా చెప్పకూడదూ! నాకేం దివ్యదృష్టి లేదు తెలుసుకుందుకు."

"అవునులెండి" అక్కయ్యనుకొంది.

"కంటికి కునుకేనా వచ్చిందీ."

"ఏరితే పారిపోతా ననుకున్నావా? చిన్న పిల్లవాడి నన్నట్టు మాట్లాడుతావేం? చాలా బాగుంది చాదస్తం. పొరుగింటి పోలీసు పెళ్ళానికి కూడా రిపోర్టియ్యాల్సింది, పరువుకూడా పోను."

ఎలా అంటారో...అక్కయ్య విస్తుపోయింది.

"ఇంకో పదినిమిషా లాలస్యంచేస్తే అంతా అయేదే లేవయ్యా...ఒప్పుకో తప్పును" అంటూ కాఫీగ్లాసుక్క తీసుకొచ్చాడు తమ్ముడు.

"ఏమిటయ్యా మరీను- మీ అక్కయ్య చెప్పా నంటుంది. నాకు తెలియలేదుమరి. ఎంత నాజూగ్గా చెప్పిందో! వెళ్ళాలనిపించింది. వెళ్లేను. ఇంత రాద్ధాంతం అని నాకేం తెలుసు. ఈపైన చెప్పే వెళ్ళాలిమరి."

బావ భోజనాని కుపక్రమించేడు.

"ఏమనుకొన్నావ్" అంటారు...ఏమనుకొంది? తనేమనుకొంది? ఓ పావుగంట ముందుకూ యిప్పటికీ ఎంత తేడా!

"అబ్బా..అలిసిపోయావ్...ఈ గుక్క పుచ్చుకో ముందు"... అక్కయ్య విస్తుపోయింది. ఆమెకి కోపంవచ్చింది. మెల్లిగా నవ్వుకొంది కాఫీగుక్క చప్పరిస్తూ.

"ఈ గుక్క మా బావ కోసం."

తమ్ముడు 'టోస్టు' ప్రొపోజ్ చేస్తున్నాడు.

---

స్కెచ్

# అదృశ్యుల ఆవాహన

వల్లూరి కృష్ణారావు

భోజనంచేస్తున్న మూర్తి యాథాలాపంగా అన్నాడు: "నిజంగా అదృష్టవంతుడు. అదృష్టం ఎవర్ని వరిస్తుందో ఎప్పుడు వరిస్తుందో తెలియదుకదా! నిన్నటిదాకా వాడు ఒక సాదామనిషి. ఈ రోజున లక్షాధికారి." ఈ మాటలు యాథాలాపంగానే అన్నాడుగాని భార్య వినాలని అన లేదు. భార్యకు అర్థంకాక తికమకపడి పులుసు గరిటె మజ్జిగగిన్నెలో పెట్టి మరుక్షణంలో తెప్పరిల్లి అక్కడనుంచే భర్తవంకచూస్తూ "ఎవరండీ?" అంది. మూర్తికూడా అప్పుడే తేరుకున్నాడు. తనమాటలు భార్య వింటోందని అర్థం చేసుకొని చెప్పడం మొదలెట్టాడు—

"పొద్దున్నే పైరొచ్చింది."

"ఎవరికి? ఎప్పుడు?"

"రామారావుకు సువ్వెరగవులే. ఇక్కడే పక్క పాలెం. కాసులేని సన్యాసి. వాడిప్పుడు లక్షకు నాథుడు."

"పాతు దొరికిందా!"

"నీ మొహం. డర్బీలో కట్టాడు."

"డర్బీ అంటే?"

"నీకు తెలియదు పోదూ. లాటరీలో కట్టాడు. లక్షరూపాయిలు వచ్చాయి."

"వాడిపెళ్ళాం అదృష్టం!"

"మరి నా పెళ్ళాం అదృష్టం?"

"చూస్తున్నారుగా. రంగువెలిసిన నేతగుడ్డ! హు! నాదీ ఒక—"

"సరేలే."

భోజనంచేసి పడక కుర్చీమీద కూర్చున్నాడు. తిరిగి రామారావును గురించి ఆలోచిస్తున్నాడు. లక్షాధికారి! రామారావుమీద తగని అసూయ కలిగింది మూర్తికి.

భార్య భోజనం ముగించుకొని వచ్చింది. వేళ్ళ సందున ఉన్న సిగరెట్టు కాలుతూనే ఉందిగాని పీలవడు.